Adb01:Adb01.qxd 7/1/2026 11:15 PM Page 1


# ఆదిలాబాద్ వార్త



మంచిర్యాల, కొమురం భీం ఆసిఫాబాద్, నిర్మల్

గురువారం 2 ,జులై 2026


## ప్రతి ప్రభుత్వ ఉద్యోగి జీవితంలో పదవీ విరమణ తప్పనిసరి

### ..మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

నస్పూర్, జూలై 1, ప్రభాతవార్త



ప్రజలతో మమేకమై సేవలు అందించే ప్రతి ప్రభుత్వ ఉద్యోగి జీవితంలో పదవీ విరమణ తప్పనిసరి అని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం రాత్రి జిల్లాలోని నస్పూర్‌లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన ఆత్మీయ వీడ్కోలు సమావేశంలో కలెక్టరేట్ పరిపాలన అధికారిగా పనిచేస్తూ పదవీ విరమణ పొందుతున్న పిన్న రాజేశ్వర్ దంపతులు, బెల్లంపల్లి సబ్ కలెక్టర్ కార్యాలయ డి.ఎ.ఓ.గా పనిచేస్తూ పదవి విరమణ పొందుతున్న పుప్పాల హనుమంతరావు దంపతులను డి.సి.పి. ఎ.భాస్కర్, జిల్లా అదనపు కలెక్టర్లు పి.చంద్రయ్య, వి.రాములు, బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్, జిల్లా రెవెన్యూ అధికారి మోతిరామ్, మంచిర్యాల రాజస్వ మండల అధికారి శ్రీనివాస్ రావు, జిల్లా అధికారులతో కలిసి శాలువా, జ్ఞాపికలతో సన్మానించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పరిపాలన అధికారి పిన్న రాజేశ్వర్ విధులలో నిబద్ధతతో పని చేసి టైపిస్టు నుండి తహసిల్దార్ వరకు 39 సంవత్సరాలు సేవలు అందించారని తెలిపారు. డి.ఎ.ఓ. పుప్పాల హనుమంతరావు 39 సంవత్సరాల పాటు నిరంతరాయంగా సేవలు అందించడం అభినందనీయమని అన్నారు. ప్రభుత్వ ఉద్యోగి విధులలో చేరిన రోజునే పదవీ విరమణ రోజు కూడా నిర్ణయించడం జరుగుతుందని, ప్రతి ప్రభుత్వ ఉద్యోగి జీవితంలో పదవీ విరమణ తప్పనిసరి అని, పదవీ విరమణ పొందిన అనంతరం శేష జీవితాన్ని కుటుంబ సభ్యులతో కలిసి సంతోషంగా గడపాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

## విద్యార్థుల భవిష్యత్తు ఉపాధ్యాయుల చేతుల్లోనే ఉంది

### * జిల్లా కలెక్టర్ కె.హారిత

కెరమెరి, జూలై 1, ప్రభాతవార్త:




విద్యార్థులను సమాజంలో మంచి పౌరులుగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమైనదని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. బుధవారం జిల్లాలోని కెరమెరి మండలం అగర్వాడ గ్రామంలో గ్రామ సర్పంచ్ రోజా సోనాజీ ఆధ్వర్యంలో విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులను సమాజంలో మంచి పౌరులుగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమైనదని అన్నారు. తల్లిదండ్రులు వారి పిల్లలను ప్రతిరోజు క్రమం తప్పకుండా పాఠశాలకు పంపించాలని, ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలని తెలిపారు. అన్ని ప్రభుత్వ పాఠశాలలలో సకల సౌకర్యాలు కల్పించి విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. విద్యార్థులకు అల్పాహారం, పోషకాలతో కూడిన రుచికరమైన మధ్యాహ్న భోజనం, ఏకరూప దుస్తులు, పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలను ఉచితంగా అందిస్తుందని తెలిపారు. ప్రాథమిక విద్యాభ్యాసం పూర్తి అయిన తర్వాత పై చదువులకు గురుకుల పాఠశాలలకు పంపించాలని, ఉపాధ్యాయులు విద్యార్థులకు నాణ్యమైన విద్యా బోధన అందించాలని తెలిపారు. ప్రతిరోజు విద్యార్థులు పాఠశాలకు హాజరై 100 శాతం హాజరు నమోదు చేసేలా ఉపాధ్యాయులు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. గ్రామ సర్పంచ్ విద్యార్థులకు నోట్ పుస్తకాలు అందించడం అభినందనీయమని తెలిపారు. ఈ సందర్భంగా గ్రామంలో నెలకొన్న పలు సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకురాగా వెంటనే స్పందించి గ్రామానికి వెళ్లే రహదారి, గ్రామంలోని అంతర్గత రహదారులు, మురుగు కాలువల వ్యవస్థ నిర్మాణానికి, గ్రామంలో రేషన్ షాప్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి ఆడే ప్రకాష్, సర్పంచ్ రోజా సోనాజీ, ఉపాధ్యాయులు, పంచాయితీ పాలకవర్గ సభ్యులు, గ్రామస్తులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## 16గ్రామపంచాయతీల్లో 128 సీసీ కెమెరాల ఏర్పాటు

### * డీఎస్పీ వహీదుద్దీన్

కాగజ్‌నగర్, జూలై 1 ప్రభాత వార్త:

గ్రామాల్లో నేరాల నియంత్రణ, ప్రజల భద్రతను మరింత పటిష్ఠం చేసేందుకు ఈజ్‌గాం పోలీస్‌స్టేషన్ పరిధిలో సీసీ కెమెరాల ఏర్పాటుకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టారు. కాగజ్‌నగర్ డీఎస్పీ వహీదుద్దీన్ ఆదేశాల మేరకు ఈజ్‌గాం పీఎస్ పరిధిలోని 16 గ్రామపంచాయతీల సర్పంచ్‌లు, ఉపసర్పంచ్‌లతో అవగాహన సమావేశం నిర్వహించారు.కాగజ్‌నగర్ రూరల్ సీఐ కుమారస్వామి ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో గాం ఎస్ఐ నరేశ్ పాల్గొని గ్రామాల్లో సీసీ కెమెరాల అవసరాన్ని వివరించారు. నేరాల నివారణ, దొంగతనాల నియంత్రణ, రహదారి ప్రమాదాల విచారణ,




అనుమానాస్పద వ్యక్తుల కదలికల గుర్తింపు, శాంతిభద్రతల పరిరక్షణలో సీసీ కెమెరాలు కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు.ఈజ్‌గాం పోలీస్‌స్టేషన్ పరిధిలో మొత్తం 16 గ్రామపంచాయతీలు ఉండగా, ప్రతి గ్రామపంచాయతీలో కనీసం 8 సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. దీంతో మొత్తం 128 సీసీ కెమెరాలను ఏర్పాటు చేసే ప్రణాళిక రూపొందించినట్లు అధికారులు వెల్లడించారు.గ్రామాల్లో ప్రధాన కూడళ్లు, గ్రామ ప్రవేశ, నిష్క్రమణ మార్గాలు, పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాలు, మార్కెట్ ప్రాంతాలు, ప్రజలు ఎక్కువగా రాకపోకలు సాగించే ప్రాంతాల్లో కెమెరాలను ఏర్పాటు చేయాలని సూచించారు. కెమెరాలు నాణ్యమైనవి, రాత్రిపూట కూడా స్పష్టంగా చిత్రీకరించే సామర్థ్యం కలిగి ఉండాలని పేర్కొన్నారు.సర్పంచ్‌లు, ఉపసర్పంచ్‌లు గ్రామ భద్రతలో భాగస్వాములై కెమెరాల ఏర్పాటుకు సహకరించాలని, ప్రజల్లో కూడా అవగాహన కల్పించాలని కోరారు. గ్రామస్థుల సహకారంతో ఈ కార్యక్రమాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని సమావేశంలో నిర్ణయించారు.

## సింగరేణి అధికారుల దీక్షకు హరీష్ రావు సంఘీభావం

### అధికారుల సమస్యలపై అసెంబ్లీలో పోరాడుతాం.. ఉపముఖ్యమంత్రి స్పందించకపోవడం దారుణం

నస్పూర్, జూలై 1, ప్రభాతవార్త



సీఎంఓఏఐ కేంద్ర కమిటీ పిలుపు మేరకు పే అప్‌గ్రేడేషన్, పీఆర్‌పీ బకాయిల చెల్లింపు తదితర న్యాయమైన డిమాండ్ల సాధనకై సింగరేణి అధికారులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు బుధవారం నాటికి మూడవ రోజుకు చేరాయి. శ్రీరాంపూర్ ఏరియాలోని అధికారుల దీక్షా శిబిరాన్ని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావు సందర్శించి తమ సంపూర్ణ సంఘీభావాన్ని ప్రకటించారు. ఈ సందర్భంగా హరీష్ రావు మాట్లాడుతూ.. సింగరేణి అధికారులు గత మూడు రోజులుగా శాంతియుతంగా దీక్షలు చేస్తున్నప్పటికీ, సింగరేణి సంస్థ పరిధిలోని ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క స్పందించకపోవడం అత్యంత దారుణమన్నారు. గతంలో తమ ప్రభుత్వ హయాంలో అధికారులకు ఇలాంటి దుస్థితి రాలేదని గుర్తుచేశారు. సింగరేణి సంస్థను నిర్వీర్యం చేసే కుట్రలు జరుగుతున్నాయని ఆరోపించిన ఆయన, సంస్థ ఉనికిని కాపాడుకోవడానికి అధికారులు, ఉద్యోగులు కలిసికట్టుగా పోరాడాలని పిలుపునిచ్చారు. అధికారుల న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం రాబోయే అసెంబ్లీ సమావేశాల్లో గళమెత్తుతామని హామీ ఇచ్చారు. శ్రీరాంపూర్ ఏరియాలో బుధవారం జరిగిన దీక్షలో ఐకే1ఏ మేనేజర్ కోటయ్య, ఆర్ అండ్ డీ మేనేజర్ అమర్నాథ్, సీనియర్ పీఓలు సంతన్, ఓంకారి బాబు, అరుణ్, రామాచారి, డీవై ఎస్ఈ మల్లేష్ తదితరులు పాల్గొన్నారు. యాజమాన్యం, ప్రభుత్వం నుండి డిమాండ్లపై స్పష్టమైన హామీ వచ్చే వరకు వెనక్కి తగ్గేదే లేదని అధికారులు స్పష్టం చేశారు. జూలై 13 వరకు కొనసాగే ఈ రిలే నిరాహార దీక్షలను జయప్రదం చేయాలని, ప్రతి ఒక్క అధికారి ఇందులో భాగస్వాములు కావాలని సీఎంఓఏఐ ప్రతినిధులు కోరారు.

## సమాజంలో వైద్యులు దైవంతో సమానం

### ...తాండూర్ లయన్స్ క్లబ్ అధ్యక్షులు ఉమ్రావ్ సింగ్

**తాండూర్, జూలై 1, ప్రభాతవార్త :**

సమాజంలో రోగుల ప్రాణాలు కాపాడే వైద్యులు దైవంతో సమానమని తాండూర్ లయన్స్ క్లబ్ అధ్యక్షుడు ఠాకూర్ ఉమ్రావ్ సింగ్ అన్నారు. బుధవారం ప్రపంచ వైద్యుల దినోత్సవం సందర్భంగా బుధవారం మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ ఝాన్సీ రాణిని క్లబ్ ఆధ్వర్యంలో శాలువతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమ్మ జన్మనిస్తే వైద్యులు పునర్జన్మని ఇస్తారని కొనియాడారు. మధుమేహం దినోత్సవం సందర్భంగా ఐబి కేంద్రంలో ప్రజలకు బిపి, షుగర్ పరీక్షలు ఉచితంగా నిర్వహించారు. పోస్టల్ దినోత్సవం సందర్భంగా పోస్టల్ ఉద్యోగులను సన్మానించారు. ఈ కార్యక్రమాలు క్లబ్ ప్రధాన కార్యదర్శి తాటిపాముల సాంబమూర్తి, ఉపాధ్యక్షులు మద్దికుంట చందు, కోశాధికారి గందె రాజన్న, క్లబ్ ప్రతినిధులు రాజన్న, ఎల్క రాంచందర్, బాపురెడ్డి, తదితరులు పాల్గొన్నారు.




## వైద్యుల దినోత్సవం సందర్భంగా వైద్యులకు సన్మానం




**ఆసిఫాబాద్, జులై 1, ప్రభాతవార్త**

వైద్యుల దినోత్సవాన్ని పురస్కరించుకుని వాసవి క్లబ్ ఆధ్వర్యంలో పట్టణంలోని పలువురు వైద్యులను ఘనంగా సన్మానించారు. బుధవారం కలెక్టరేట్ లోని జిల్లా వైద్య శాఖ అధికారి కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు మర్యాల ఉదయ్ బాబు, ఇంటర్నేషనల్ మల్టిపుల్ సెక్రెటరీ ఎకరాల శ్రీనివాస్, ఆసిఫాబాద్ కౌన్సిలర్ చిలివేరి వెంకటేశ్వర్లు తో కలిసి డిఎంహెచ్ఓ సీతారాం, రేడియాలజీ ఎండి తోట అశ్వితకు శాలువ కప్పి సన్మానం చేశారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షుడు మాట్లాడుతూ సమాజంలో వైద్యుల పాత్ర అతి పవిత్రమైందని, సమాజ ఆరోగ్య పరిరక్షణలో వైద్యులు అందిస్తున్న సేవలు అమూల్యమైనవని, వారి సేవలను గుర్తిస్తూ ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. వైద్యులు తమ వ్యక్తిగత జీవితాలను పక్కనపెట్టి ప్రజల ఆరోగ్యం కోసం నిరంతరం కృషి చేస్తున్నారని కొనియాడారు. ముఖ్యంగా అత్యవసర పరిస్థితులు, అంటువ్యాధుల సమయంలో వైద్యులు అందించిన సేవలు సమాజానికి ఆదర్శంగా నిలిచాయని పేర్కొన్నారు. అనంతరం డిఎంహెచ్ఓ మాట్లాడుతూ తమ సేవలను గుర్తించి గౌరవించిన వాసవి క్లబ్ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో కూడా ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు కృషి చేస్తామని చెప్పారు. కొమరం భీం జిల్లాలో అమలవుతున్న ఆరోగ్య సేవ కార్యక్రమాలను వివరిం చారు. ఈ కార్యక్రమంలో వాసవి క్లబ్ కోశాధికారి శ్రీధర్, మాజీ అధ్యక్షులు పాత శ్రీనివాస్, సభ్యులు కల్లూరి దిలీప్, వైద్యులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## విబి.జి.రాంజీ చట్టాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలి

### ...సిటియు జిల్లా సహాయ కార్యదర్శి దాగం రాజారం

**తాండూర్, జూలై 1, ప్రభాతవార్త :**

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం తీసుకొచ్చివిబి.జి.రాంజీ చట్టాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని సిఐటియు మంచిర్యాల జిల్లా సహాయ కార్యదర్శి దాగం రాజారం డిమాండ్ చేశారు.మండలంలోని ఐబి వద్ద జాతీయ రహదారిపై బుధవారం వ్యవసాయ కార్మిక సంఘం, సిఐటియు ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భముగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల కూలీల పొట్ట పొట్టెందుకే కేంద్రం ఉపాధి హామీ చట్టం పేరును విబి.జి.రాంజీ చట్టంగా మార్చిందన్నారు. ఈ చట్టం అమలు వలన కూలీలకు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటారని, తీరని అన్యాయం జరుగుతుందని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం పూనరాలోచించుకొని మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి పథకం పేరునే కొనసాగించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు వేల్పుల శంకర్,నాయకులు దుర్గం నాన్నయ్య, బొల్లం రాజేశం, జైనేని రాజయ్య, జైనేని భూమయ్య, స్వామి, రాంబాబు, సారయ్య, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.



## ప్రజారోగ్యమే లక్ష్యంగా వైద్య సిబ్బంది పనిచేయాలి

**ఆసిఫాబాద్, జులై 1, ప్రభాతవార్త :**

ప్రజారోగ్యమే లక్ష్యంగా వైద్య సిబ్బంది పనిచేయాలని జిల్లా వైద్యాధికారి సీతారాం అన్నారు. జిల్లా కార్యాలయంలో సిబ్బందితో కలిసి అంతర్జాతీయ వైద్యుల దినోత్సవం లో భాగంగా బుధవారం కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్య వృత్తి ఎంతో గొప్పదన్నారు. దేవుడు మనిషికి జన్మనిస్తే వైద్యుడు పునర్జన్మను ఇస్తాడని గుర్తు చేశారు. అటువంటి వైద్య వృత్తిలో పనిచేస్తున్న ప్రతి ఒక్కరు నిబద్ధతతో ఉండాలన్నారు. జిల్లాలో అనేకమంది పేద, మధ్యతరగతి రోగులు వైద్య నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి వస్తారని వారికి సరైన చికిత్స అందించాల్సిన బాధ్యత వైద్యులపై ఉందన్నారు. ఆసుపత్రిలో ఉన్న వసతులను సమతుల్యం చేసుకుంటూ నాణ్యమైన వైద్య సేవలు అందించే దిశగా సిబ్బంది కృషి చేయాలన్నారు. జిల్లాలోని వైద్య ఆరోగ్య శాఖలో పనిచేస్తున్న ప్రతి ఒక్కరికి అంతర్జాతీయ వైద్యుల దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో లెప్రసీ జిల్లా కోఆర్డినేటర్ శ్యామ్లాల్, సిహెచ్ఓలు వాసుదేవ్, మహాలక్ష్మి, ఎన్సిడి కోఆర్డినేటర్ సంతోష్, డిప్యూటీ డెమో మార్త, సిబ్బంది పాల్గొన్నారు.



## ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు

**ఆసిఫాబాద్ , జూలై 1, ప్రభాతవార్త :**



వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో ఆసిఫాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డులలో పారిశుద్ధ్య పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. పట్టణంలో అంటువ్యాధులు ప్రబలకుండా వర్షపు నీరు సజావుగా సాగిపోయేలా మున్సిపల్ యంత్రాంగం ప్రత్యేక చర్యలు చేపట్టింది. బుధవారం పట్టణంలోని పలు కాలనీలలో జరుగుతున్న పారిశుద్ధ్య పనులను మున్సిపల్ చైర్పర్సన్ ఆకాష్, వైస్ చైర్పర్సన్ ఎండి అహ్మద్, మున్సిపల్ కమిషనర్ అంజయ్యలతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కాలనీల్లోని ప్రధాన డ్రైనేజీలలో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని, పూడికను జేసీబీ యంత్రాల సహాయంతో సిబ్బంది తొలగించారు. వర్షాలు పడినా నీరు నిల్వ ఉండకుండా డ్రైనేజీలను ఎప్పటికప్పుడు పరిశుభ్రం చేయిస్తున్నట్లు తెలిపారు. ప్రజలు మున్సిపల్ సిబ్బందికి సహకరించి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని వారు కోరారు. వర్షాకాలంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తుగా పారిశుద్ధ్య పనులను ముమ్మరం చేశామని, పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచడమే తమ ప్రాధాన్యత అని మున్సిపల్ అధికారులు స్పష్టం చేశారు. ఈ పర్యవేక్షణ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది రామయ్య, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## పాఠశాలల పని వేళలు మార్చాలి

**కాగజ్నగర్ రూరల్, జులై 1, ప్రభాతవార్త :**

పీఆర్టియూటీఎస్ కాగజ్నగర్ మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎనగంటి బిక్షపతి, జాడి దేవాజీ లు ఆధ్వర్యంలో కాగజ్ నగర్ మండలంలోని ఆరెగూడ, కడంబ,గన్నారం బట్టుపల్లి పాఠశాలలలో పి ఆర్ టి యు టి ఎస్ సభ్యత్వ నమోదు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా అధ్యక్షులు ఏటుకూరి శ్రీనివాసరావు మాట్లాడుతూ పాఠశాల పని వేళలు ఉదయం 9:30 నుంచి ప్రారంభించారని మహాత్మ జ్యోతి పూలే కేజీబీవీ పాఠశాలలకు కెర్ టేకర్ల ను నియమించాలని , వేతన సవరణ నివేదికను విడుదల చేయాలని, కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని పునర్ధరణ చేయాలని, పాఠశాలల సముదాయాన్ని రద్దుచేసి మండల విద్యాశాఖ అధికారులకు ప్రాథమిక పాఠశాలల నిర్వహణ ఇవ్వాలని, కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఉద్యోగ ఉపాధ్యాయులకు హెల్త్ కార్డులు మంజూరు చేయాలని, డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో రౌతు రవి, జయేందర్ ,మడవి హనుమంతు, సత్యనారాయణ గౌడ్, అనురాధ భాయి పాల్గొన్నారు



## ధాన్యం లోడింగ్, పంపిణీ ప్రక్రియ వేగవంతం చేయాలి

### ...మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు

**నస్పూర్, జూలై 1, ప్రభాతవార్త**

ఎం ఎల్ ఎస్ పాయింట్ గోదాము నుండి ధాన్యం లోడింగ్, పంపిణీ ప్రక్రియ వేగవంతం చేయాలని మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు అన్నారు. బుధవారం జిల్లాలోని నస్పూర్ మండలం తీగల్పహాడ్లో గల ఎం.ఎల్.ఎస్. పాయింట్ గోదామును పౌరసరఫరాల శాఖ జిల్లా మేనేజర్ శ్రీకళ, అధికారులతో కలిసి తనిఖీ చేసి ధాన్యం ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ గోదాము నుండి ధాన్యం లోడింగ్, పంపిణీ పరిక్రియను వేగవంతం చేయాలని, వీలైనంత త్వరగా డీలర్లకు చేరేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ధాన్యం తరలింపులో జాప్యం కారణంగా ప్రజలు ఎలాంటి ఇబ్బందులకు గురికాకుండా పర్యవేక్షించాలని స్టేజ్ 2 గుత్తేదారు, సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## ఉద్యోగి జీవితంలో పదవి విరమణ సహజం

**ఆసిఫాబాద్ టౌన్, జులై 1, ప్రభాతవార్త :**

ప్రతి ప్రభుత్వ ఉద్యోగి జీవితంలో పదవి విరమణ సహజమని జిల్లా అటవీశాఖ అధికారిని బాలమణి అన్నారు. జిల్లాలోని కెరమెరి రేంజ్ పరిధిలో బీట్ అధికారిగా విధులు నిర్వహించిన యశ్వంత్ రావు పదవి విరమణ మహోత్సవాన్ని బుధవారం జిల్లా కేంద్రంలోని అటవీశాఖ కార్యాలయంలో నిర్వహించగా ముఖ్యఅతిథిగా హాజరై వారిని సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగి ఉద్యోగ సమయంలో చేసిన సేవలు తదనంతరం గుర్తింపును తీసుకువస్తాయన్నారు. యశ్వంత్ రావు 30 సంవత్సరాల పాటు అటవీ శాఖకు సేవ చేయడం ఎంతో గుర్తించదగ్గదన్నారు. తన శేష జీవితం కుటుంబ సభ్యులతో సుఖసంతోషాలతో గడపాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వివిధ రేంజ్ ల అధికారులు మజారుద్దీన్, రమాదేవి, జూనియర్ ఫారెస్ట్ అసోసియేషన్ అధ్యక్షుడు యోగేష్ తో పాటు సిబ్బంది పాల్గొన్నారు.



## వే బ్రిడ్జ్, క్లరికల్ సిబ్బంది సమస్యలను పరిష్కరించాలి

### గుర్తింపు సంఘం జీఎం చర్చల ప్రతినిధి బద్రి బుచ్చయ్య



**నస్పూర్, జూలై 1, ప్రభాతవార్త**

శ్రీరాంపూర్ ఓపెన్ కాస్ట్ ప్రాజెక్ట్‌లో విధులు నిర్వహిస్తున్న వే బ్రిడ్జ్, క్లరికల్ సిబ్బంది ఎదుర్కొంటున్న వివిధ దీర్ఘకాలిక సమస్యలను యాజమాన్యం తక్షణమే పరిష్కరించాలని గుర్తింపు సంఘం (ఏఐటీయూసీ) జీఎం చర్చల ప్రతినిధి బద్రి బుచ్చయ్య డిమాండ్ చేశారు. బుధవారం శ్రీరాంపూర్ ఓపెన్ కాస్ట్ ప్రాజెక్ట్ ఆఫీసర్ సిహెచ్. వెంకటేశ్వర్లును కలిసి కార్మికుల సమస్యలపై వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా బద్రి బుచ్చయ్య మాట్లాడుతూ, ఓసీపీ వే బ్రిడ్జ్‌లో పనిచేస్తున్న క్లర్కులకు పని భారం దృష్ట్యా ఇన్సెంటివ్ కల్పించాలని, రెండు దశాబ్దాల క్రితం నాటి వే బ్రిడ్జ్‌ను సురక్షిత ప్రదేశానికి మార్చాలని కోరారు. కార్యాలయం, సర్వే విభాగ సిబ్బందికి పార్కింగ్, క్లరికల్ సిబ్బందికి ఫర్నిచర్ ఏర్పాటు చేయడంతో పాటు విద్యుత్ అంతరాయం కలగకుండా ఇన్వర్టర్ వ్యవస్థను అందుబాటులోకి తీసుకురావాలని బద్రి బుచ్చయ్య కోరారు. ముఖ్యంగా డీజీఎంఎస్ మార్గదర్శకాలు, మైన్స్ యాక్ట్ నిబంధనలకు అనుగుణంగా తగిన రక్షణ చర్యలు చేపట్టాలని కోరారు. దీనిపై ప్రాజెక్ట్ ఆఫీసర్ సిహెచ్. వెంకటేశ్వర్లు సానుకూలంగా స్పందిస్తూ, సమస్యలను పరిశీలించి త్వరలోనే తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో శ్రీరాంపూర్ ఓపెన్ కాస్ట్ పిట్ సెక్రటరీ మోతె లచ్చన్న, సీనియర్ నాయకులు మోహన్ రెడ్డి, శ్రీరాంపూర్ ఓసీపీ క్లరికల్ ఇన్‌చార్జ్ రమేష్, సత్యనారాయణ, మహిళా ప్రతినిధి సరోజ, ఇతర ఉద్యోగులు పాల్గొన్నారు.




## క్వాలిటీ బొగ్గు ఉత్పత్తిలో సింగరేణిలోనే శ్రీరాంపూర్ ఏరియా టాప్

### జనరల్ మేనేజర్ మునిగంటి శ్రీనివాస్

**నస్పూర్, జూలై 1, ప్రభాతవార్త**

జూన్ మాసంలో 80 శాతం గ్రేడ్ సాటిస్ఫాక్షన్‌తో క్వాలిటీ బొగ్గు ఉత్పత్తి విషయంలో సింగరేణి సంస్థలోనే శ్రీరాంపూర్ ఏరియా ప్రథమ స్థానంలో నిలిచిందని ఏరియా జనరల్ మేనేజర్ మునిగంటి శ్రీనివాస్ వెల్లడించారు. సోమవారం మీడియా ప్రతినిధులతో ఆయన మాట్లాడుతూ శ్రీరాంపూర్ ఏరియా జూన్ నెల ఉత్పత్తి లక్ష్యం 4,06,500 టన్నులకు గాను 3,39,151 టన్నులు సాధించినట్లు తెలిపారు. ఇందులో భూగర్భ గనులు రికార్డు స్థాయిలో ఓవరాల్‌గా 96 శాతం ఉత్పత్తి సాధించాయని, ఎస్ఆర్‌పీ 1 గని అత్యధికంగా 122 శాతం ప్రగతి కనబరిచిందని పేర్కొన్నారు. ఉపరితల గనులకు సంబంధించి జూన్ మాసంలో 2,25,577 టన్నుల ఉత్పత్తి సాధించినట్లు మునిగంటి శ్రీనివాస్ చెప్పారు. ఎస్ఆర్‌పీ ఓసీలో రెండో కాంట్రాక్టు ప్రారంభం కావడం, ఇందారం ఓసీలో కొత్త కాంట్రాక్ట్ ఒప్పందం పూర్తి కావడంతో రానున్న రోజుల్లో ఉత్పత్తి మరింత పెరగనుందన్నారు. 2026-2027 ఆర్థిక సంవత్సరానికి యాజమాన్యం నిర్దేశించిన 64 లక్షల 30 వేల టన్నుల వార్షిక ఉత్పత్తి లక్ష్యాన్ని ముందస్తు ప్రణాళికలతో అధిగమిస్తామన్నారు. వర్షాకాలం నేపథ్యంలో గనుల్లో పంపింగ్ వ్యవస్థ, రక్షణ చర్యలు పూర్తి చేశామని వెల్లడించారు. ఏరియాలో ఇప్పటివరకు 3,856 మందికి డిపెండెంట్ ఉద్యోగాలు కల్పించామని, విరమణ పొందిన 9,766 మందికి మెడికల్ కార్డులు అందజేశామని వివరించారు. ఈ సమావేశంలో డీజీఎం (పర్సనల్) ఎస్. అనిల్ కుమార్, డీజీఎం (ఐఈడీ) రాజన్న, డీవైపీఎం క్రాంతి కుమార్ పాల్గొన్నారు.

## మూడవ రోజుకు చేరిన సింగరేణి అధికారుల రిలే నిరాహార దీక్షలు

### వేతన సవరణ బకాయిలు, వేతన శ్రేణుల మెరుగుదల అమలు సహా ..

### పలు డిమాండ్ల సాధనకు పోరాటం ఉధృతం

**మందమర్రి, జూలై 1, ప్రభాతవార్త:**

సింగరేణి సంస్థలో పెండింగ్‌లో ఉన్న అధికారుల సమస్యల పరిష్కారం కోసం కోల్ మైన్స్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు బుధవారం మూడవ రోజుకు చేరాయి. మందమర్రి ప్రాంత జీఎం కార్యాలయం ఎదుట నిర్వహిస్తున్న దీక్షల్లో అధికారులు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ డిమాండ్లకు మద్దతు తెలిపారు.




**నాలుగు ప్రధాన డిమాండ్లపై ఆందోళన**

వేతన సవరణ బకాయిలను వెంటనే చెల్లించడం, వేతన శ్రేణుల మెరుగుదల అమలు చేయడం, ఉద్యోగుల పిల్లలకు ఐఐటి/ఎన్ఐటి విద్యా ఖర్చుల పునఃచెల్లింపు సౌకర్యం కల్పించడం, ఉచిత విద్యుత్ బిల్లు సదుపాయాన్ని పునరుద్ధరించడం వంటి ప్రధాన డిమాండ్లతో అధికారులు ఆందోళన కొనసాగిస్తున్నారు.

**సమస్యల పరిష్కారానికి యాజమాన్యం ముందుకు రావాలి:**

అధికారుల న్యాయమైన డిమాండ్లను యాజమాన్యం వెంటనే పరిష్కరించాలని సంఘం నాయకులు కోరారు. పలుమార్లు వినతులు సమర్పించినప్పటికీ స్పందన లేకపోవడంతో ఉద్యమాన్ని కొనసాగిస్తున్నామని తెలిపారు. చర్చల ద్వారా సమస్యలను పరిష్కరించాలని, లేకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు

**.....ఐక్యంగా పోరాటం కొనసాగిస్తాం**

దీక్షల్లో పాల్గొన్న అధికారులు తమ న్యాయమైన హక్కుల సాధన కోసం ఐక్యంగా పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. సమస్యలు పరిష్కారమయ్యే వరకు రిలే నిరాహార దీక్షలు నిరంతరంగా కొనసాగుతాయని సంఘం నాయకులు వెల్లడించారు.

## 12వ వేజ్ బోర్డు కమిటీని ఏర్పాటు చేయాలి: సింగరేణి జేఏసీ డిమాండ్

### శ్రీరాంపూర్ ఏరియాలోని అన్ని గనులపై కార్మిక సంఘాల ఉమ్మడి ధర్నా

**నస్పూర్, జూలై 1, ప్రభాతవార్త**



బొగ్గు గని కార్మికులకు సంబంధించిన 12వ వేజ్ బోర్డు వేతన కమిటీని వెంటనే ఏర్పాటు చేయాలని, కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సింగరేణి జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం శ్రీరాంపూర్ ఏరియాలో నిరసన జ్వాలలు మిన్నంటాయి. ఏఐటీయూసీ, ఐఎన్టీయూసీ, సీఐటీయూ, హెచ్ఎంఎస్ సంఘాల ఉమ్మడి ఆధ్వర్యంలో ఏరియాలోని అన్ని బొగ్గు గనులు, విభాగాల పై భారీ ధర్నాలు నిర్వహించి, యాజమాన్య ప్రతినిధులకు వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా జేఏసీ ముఖ్య నాయకులు మాట్లాడుతూ.. 11వ వేజ్ బోర్డు కాలపరిమితి ముగిసినప్పటికీ, కేంద్ర ప్రభుత్వం మరియు యాజమాన్యం నిర్లక్ష్య వైఖరి కారణంగా నేటి వరకు 12వ వేజ్ బోర్డు కమిటీని ఏర్పాటు చేయకపోవడం దారుణమన్నారు. కార్మికుల హక్కులను కాలరాసే నాలుగు లేబర్ కోడ్లను అమలు చేయాలనే కుట్రలో భాగంగానే ఈ వేతన కమిటీ ఏర్పాటును కాలయాపన చేస్తున్నారని వారు మండిపడ్డారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం, యాజమాన్యం తక్షణమే స్పందించి వేతన కమిటీని నియమించాలని, లేనిపక్షంలో భవిష్యత్తులో సింగరేణి వ్యాప్తంగా ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ ఉమ్మడి నిరసన కార్యక్రమంలో ఏఐటీయూసీ శ్రీరాంపూర్ బ్రాంచ్ కార్యదర్శి ఎస్కె బాజీ సైదా, నాయకులు కొట్టే కిషన్ రావు, మోత్కూరి కొమురయ్య, రాచర్ల చంద్రమోహన్, నాగభూషణం, బద్రి బుచ్చయ్య, ఫిట్ కార్యదర్శులు దాడి రాజయ్య, మురళి చౌదరి, మోతే లచ్చన్న, మారపల్లి సారయ్య, ఆకుల లక్ష్మణ్, గునిగంటి నర్సింగ్‌రావు, ఐఎన్టీయూసీ నాయకులు శీలం చిన్నయ్య, జగన్, శ్రీధర్, గోపాల్ రెడ్డి, నంబయ్య, అశోక్, సీఐటీయూ నాయకులు సుధాకర్, సందీప్, హెచ్ఎంఎస్ నాయకులు శశిధర్, ప్రసాద్, సురేందర్ తదితరులతో పాటు కార్మికులు పాల్గొన్నారు.

## జాతీయ పెన్కాక్ సిలాట్ పోటీల్లో మంచిర్యాల క్రీడాకారుల ఘనత

### విజేతలను అభినందించిన జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**నస్పూర్, జూలై 1, ప్రభాతవార్త**



మహారాష్ట్రలోని నాసిక్‌లో గత నెల 25 నుండి 30 వరకు నిర్వహించిన జాతీయ స్థాయి పెన్కాక్ సిలాట్ పోటీల్లో మంచిర్యాల జిల్లాకు చెందిన క్రీడాకారులు అద్భుత ప్రతిభ కనబరిచి పతకాలు సాధించారు. జాతీయ స్థాయిలో రాణించి జిల్లా కీర్తిని చాటిన ఈ విజేతలను బుధవారం మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లా క్రీడాకారులు జాతీయ స్థాయి పెన్కాక్ సిలాట్ పోటీల్లో రాణించి పతకాలు సాధించడం ఎంతో భినందనీయమన్నారు. ఈ పోటీల్లో కె. మోక్షిత్ బంగారు పతకం సాధించగా.. ఇ. దక్ష, వి. అక్షర వేదశ్రీ, ఎ. శ్రీ మహాలక్ష్మి శర్మ, టి. ఆరుష్, జి. విగ్నేష్‌లు రజత పతకాలు కైవసం చేసుకున్నారు. అలాగే పి. రితేష్, జి. అచ్యుత్ శ్రీ దేవాన్ష్, టి. నయనశ్రీ, టి. నిహానిష్, టి. శివాజీలు కాంస్య పతకాలు సాధించి ప్రతిభ చాటారు. క్రీడాకారులు ఇదే ఉత్సాహంతో భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కలెక్టర్ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పెన్కాక్ సిలాట్ మంచిర్యాల జిల్లా సెక్రటరీ దాసరి రాజేశ్వర్, మాస్టర్ పోచంపల్లి వెంకటేష్, స్టేట్ టెక్నికల్ చైర్మన్ రంగు శ్రీనివాస్, కోశాధికారి మెయిన్, జెట్టి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## రక్తదానం మహాదానం... బ్యాంకు దినోత్సవం సందర్భంగా భారీ రక్తదాన శిబిరం

### మంచిర్యాలలో బ్యాంకు సిబ్బంది స్వచ్ఛందంగా ముందుకు - సామాజిక బాధ్యత చాటిన అధికారులు, ఉద్యోగులు

**మంచిర్యాల, జూలై 1, ప్రభాతవార్త**



బ్యాంకు దినోత్సవాన్ని పురస్కరించుకుని మంచిర్యాలలో భారీ రక్తదాన శిబిరం నిర్వహించారు. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా 71వ బ్యాంకు దినోత్సవం సందర్భంగా మంగళవారం మంచిర్యాల ప్రాంతీయ కార్యాలయ పరిధిలోని సిబ్బంది అందరూ కలిసి ఈ సేవా కార్యక్రమాన్ని చేపట్టారు.ఈ రక్తదాన శిబిరానికి ప్రాంతీయ కార్యాలయ ప్రాంతీయ అధికారి రితీష్ కుమార్ గుప్తా, మానవ వనరుల విభాగ అధికారి, రామకృష్ణ, ప్రధాన నిర్వహణ అధికారి సంజయ్ కుమార్, ఉద్యోగ సంఘ ప్రాంతీయ కార్యదర్శి కె. శ్రీనివాస్ తదితరులు జరయ్యారు.బ్యాంకు అధికారులు, ఉద్యోగులు పెద్ద సంఖ్యలో స్వచ్ఛందంగా రక్తదానం చేసి సామాజిక సేవలో తమ వంతు బాధ్యతను చాటుకున్నారు.ఈ సందర్భంగా ప్రాంతీయ అధికారి రితీష్ కుమార్ గుప్తా మాట్లాడుతూ, బ్యాంకు దినోత్సవం సందర్భంగా రక్తదానం వంటి సేవా కార్యక్రమాలు నిర్వహించడం ఎంతో అభినందనీయమని తెలిపారు. ఇటువంటి కార్యక్రమాలు సమాజానికి ఎంతో మేలు చేయడంతో పాటు సేవా భావాన్ని పెంపొందిస్తాయని పేర్కొన్నారు. రక్తదాన శిబిరం విజయవంతంగా ముగియగా, సేవా కార్యక్రమంలో పాల్గొన్న ఉద్యోగులను అధికారులు అభినందించారు.

## తాండూర్ ఉర్స్ షరీఫ్‌కు
## న్యాయవాది చిప్ప మనోహర్‌కు ఆహ్వానం

**బెల్లంపల్లి, జూలై 01, ప్రభాతవార్త**

తాండూర్ మండలంలో జూలై 10, 11 తేదీలలో నిర్వహించనున్న హజ్రత్ బాబా మక్దూం షాహిద్ (ఆర్.ఏ), హజ్రత్ బాబా మక్కు షాహిద్ (ఆర్.ఏ) ఉర్స్ షరీఫ్ మరియు ఖవ్వాలి మహోత్సవాలకు సంబంధించిన ఆహ్వాన పత్రికను సీనియర్ న్యాయవాది, బెల్లంపల్లి బార్ మాజీ అధ్యక్షుడు, 28వ వార్డ్ కౌన్సిలర్ చిప్ప మనోహర్ – అర్చన దంపతులకు తాండూర్ ఉర్స్ కమిటీ నాయకులు అందజేశారు. ఈ సందర్భంగా తాండూర్ మైనార్టీ ఉర్స్ కమిటీ అధ్యక్షుడు, మాజీ ఎంపీపీ సిరంగి శంకర్, తాండూర్ మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ ముడిమడుగుల సురేష్, మాజీ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఎం.డి. ఈసా తదితర మైనార్టీ నాయకులు పాల్గొన్నారు. ఉర్స్ షరీఫ్ మరియు ఖవ్వాలి మహోత్సవాలకు విచ్చేసి విజయవంతం చేయాలని వారు చిప్ప మనోహర్‌ను ఆహ్వానించారు.



## బడి బయటి బాలికను గుర్తించి
### కేజీబీవీలో చేర్పించిన విద్యాశాఖ అధికారులు

**కోటపల్లి, జూలై 1, ప్రభాతవార్త**

మంచిర్యాల జిల్లా కోటపల్లి మండలం పరిధిలోని ఎసన్వాయి ప్రాథమిక పాఠశాలలో గత విద్యా సంవత్సరంలో 5వ తరగతి పూర్తి చేసిన మారుపాక మీనాక్షి అనే బాలిక తిరిగి బడి బాట పట్టింది. అనారోగ్య కారణాల వల్ల ఆమె 2025–26 విద్యా సంవత్సరంలో 6వ తరగతిలో ప్రవేశం పొందలేక చదువుకు దూరమైంది. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న బడి బయటి పిల్లల ప్రత్యేక సర్వేలో ఈ బాలికను విద్యాశాఖ అధికారులు గుర్తించారు. అనంతరం కోటపల్లి మండల సీఆర్‌పీ శ్రీ సంపత్ ప్రత్యేక చొరవ తీసుకుని, కోటపల్లి కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవి) ఇన్‌చార్జ్ స్పెషల్ ఆఫీసర్ దీపతో సంప్రదింపులు జరిపారు. వారి సంయుక్త సహకారంతో ప్రస్తుత విద్యా సంవత్సరంలో బాలికకు కేజీబీవీలో 6వ తరగతిలో ప్రవేశం కల్పించారు. దీంతో విద్యకు దూరమైన మరో బాలికను తిరిగి విద్యా ప్రవాహంలోకి తీసుకురావడం సాధ్యమైంది. ఈ సందర్భంగా విద్యాశాఖ అధికారులు మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో బడికి దూరమైన పిల్లల సమాచారం తెలిస్తే వెంటనే సంబంధిత పాఠశాల ప్రధానోపాధ్యాయులు లేదా విద్యాశాఖ అధికారులకు తెలియజేయాలని కోరారు. ప్రతి బాలబాలిక తమ విద్యను కొనసాగించేలా ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, స్వచ్ఛంద సంస్థలు సహకరించాలని వారు విజ్ఞప్తి చేశారు.



## సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేసిన
## బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్

**నేరడిగొండ, జూలై 1, ప్రభాతవార్త:**

నెరడిగొండ మండల కేంద్రంలో బుధవారం నిర్వహించిన చెక్కుల పంపిణీ కార్యక్రమంలో బోథ్ నియోజకవర్గంలోని ఆయా మండలాలకు చెందిన 67 మంది లబ్ధిదారులకు వైద్య చికిత్స కోసం మంజూరైన రూ. 17,64,000 విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మాట్లాడుతూ.. ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఎవరూ వైద్య చికిత్సకు దూరం కాకూడదనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) ద్వారా ఆర్థిక సహాయం అందిస్తున్నట్లు తెలిపారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా తాను నిరంతరం కృషి చేస్తున్నానని చెప్పారు.ప్రజల కష్టసుఖాల్లో భాగస్వామిగా ఉంటూ, అవసరమైన ప్రతి సందర్భంలో వారికి అండగా నిలవడం ప్రజాప్రతినిధిగా తన బాధ్యతని ఎమ్మెల్యే పేర్కొన్నారు. నియోజకవర్గ అభివృద్ధితో పాటు ప్రజల సంక్షేమమే తన ప్రధాన లక్ష్యమని, ప్రభుత్వ పథకాలు అర్హులైన లబ్ధిదారులకు చేరేలా కృషి కొనసాగిస్తానని స్పష్టం చేశారు. సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందుకున్న లబ్ధిదారులు తమకు సకాలంలో ఆర్థిక సహాయం అందేలా కృషి చేసిన ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయా మండలాల నాయకులు, కార్యకర్తలు , ప్రజలు పాల్గొన్నారు.

## కార్పొరేషన్‌లో అవినీతిపై సమగ్ర విచారణ జరపాలి
### ప్రశ్నించిన ప్రజాప్రతినిధులపై అక్రమ కేసులు ఉపసంహరించాలి.పోలీసు కార్యాలయం ఎదుట భారతీయ జనతా పార్టీ నిరసన

**మంచిర్యాల, జూలై 1, ప్రభాతవార్త**



మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్‌లో జరుగుతున్న అవినీతి, నిధుల దుర్వినియోగంపై తక్షణమే సమగ్ర విచారణ చేపట్టాలని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు రఘునాథ్ వెరబెల్లి డిమాండ్ చేశారు. కార్పొరేషన్ సమావేశంలో అవినీతి, ప్రజా సమస్యలపై ప్రశ్నించిన భారతీయ జనతా పార్టీ కార్పొరేటర్లను సస్పెండ్ చేయడంతో పాటు, శాంతియుత నిరసన చేపట్టిన నాయకులపై నమోదు చేసిన కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలని ఆయన కోరారు. ఈ మేరకు మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయం ఎదుట నిర్వహించిన నిరసన కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు రఘునాథ్ వెరబెల్లి, జిల్లా అధ్యక్షులు నగునూరి వెంకటేశ్వర్ గౌడ్ మరియు పలువురు పార్టీ నాయకులు పాల్గొని పోలీసు ఉన్నతాధికారికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రఘునాథ్ వెరబెల్లి మాట్లాడుతూ, మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్‌లో జరుగుతున్న అవినీతి, నిధుల దుర్వినియోగం ప్రజల అభివృద్ధిని అడ్డుకుంటోందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్పొరేషన్‌లో జరుగుతున్న ప్రతి ఆర్థిక లావాదేవీపై పారదర్శక విచారణ జరిపి వాస్తవాలను ప్రజల ముందుంచాలని ఆయన డిమాండ్ చేశారు. మంచిర్యాల అభివృద్ధి ప్రధానంగా కేంద్ర ప్రభుత్వ నిధులతోనే జరుగుతోందని, రాష్ట్ర ప్రభుత్వం నుంచి తగిన నిధులు అందడం లేదని ఆయన ఆరోపించారు. మంచిర్యాలలో నిర్మించిన మహాప్రస్థానానికి నాలుగు కోట్ల రూపాయలు కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసినప్పటికీ, వాటిని రాష్ట్ర ప్రభుత్వ నిధులుగా ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. అదేవిధంగా జిల్లాలోని ఏడు మున్సిపాలిటీలకు మంచి నీటి సరఫరా, చెరువుల అభివృద్ధి కోసం అమృత్ పథకం కింద 320 కోట్ల రూపాయలు కేంద్ర ప్రభుత్వం కేటాయించిందని తెలిపారు. ఈ నిధుల వినియోగంలో పారదర్శకత ఉండాలని, ప్రజలకు పూర్తి వివరాలు వెల్లడించాలని డిమాండ్ చేశారు. కార్పొరేషన్‌లో అవినీతి అంశాన్ని లేవనెత్తిన ప్రజాప్రతినిధులపై అక్రమ కేసులు నమోదు చేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని ఆయన పేర్కొన్నారు. ప్రజల తరఫున ప్రశ్నించడం తప్పు కాదని, కేసులు పెట్టడం ద్వారా గొంతు నొక్కివేయాలనే ప్రయత్నాలను ప్రజలు సహించరని హెచ్చరించారు. ఈ నిరసన కార్యక్రమంలో మున్సిపల్ సభా నాయకుడు గాజుల ముఖేష్ గౌడ్‌తో పాటు కార్పొరేటర్లు కస్తూరి నాగరాజు, బోట్ల అనిత, వంగపల్లి వెంకటేశ్వర్ రావు, ఎనగందుల కృష్ణమూర్తి, పట్టి వెంకటకృష్ణ, అక్కల రమేష్, తదితరులు పాల్గొన్నారు.కార్పొరేషన్‌లో జరుగుతున్న అవినీతి ఆరోపణలపై ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకుని సమగ్ర విచారణ చేపట్టాలని భారతీయ జనతా పార్టీ నాయకులు డిమాండ్ చేశారు.

## గల్లంతైన చిన్నారుల రక్షణకు కట్టుదిట్టమైన చర్యలు
### ముస్కాన్ 12 విజయానికి అన్ని శాఖల సమన్వయం కీలకం పెద్దపల్లి, మంచిర్యాల పోలీసు ఉప కమిషనర్లు

**మంచిర్యాల, జూలై 1,ప్రభాతవార్త**



గల్లంతైన చిన్నారులను గుర్తించి సురక్షితంగా తిరిగి కుటుంబాలకు చేర్చడం, బాల కార్మికత్వం నుంచి చిన్నారులను రక్షించి వారికి పునరావాసం కల్పించడం లక్ష్యంగా చేపట్టిన ముస్కాన్ 12 కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని పెద్దపల్లి పోలీసు ఉప కమిషనర్ బి.రామిరెడ్డి మరియు మంచిర్యాల పోలీసు ఉప కమిషనర్ ఏ.భాస్కర్ లు పిలుపునిచ్చారు. తెలంగాణ పోలీసుల మహిళా భద్రత విభాగం ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా జూలై 1 నుంచి జూలై 31 వరకు నిర్వహించనున్న ముస్కాన్ 12 కార్యక్రమం అమలుకు సంబంధించి, రామగుండం పోలీసు కమిషనరేట్ ఆదేశాల మేరకు పెద్దపల్లి, మంచిర్యాల కార్యాలయాల్లో సంబంధిత శాఖల అధికారులతో సమన్వయ సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా నెల రోజులపాటు చేపట్టనున్న కార్యక్రమాల అమలు విధానం, కార్యాచరణ ప్రణాళిక, క్షేత్రస్థాయిలో తీసుకోవాల్సిన చర్యలపై సమీక్ష చేపట్టారు. గల్లంతైన చిన్నారుల ఆచూకీ కోసం ప్రత్యేక గాలింపు చర్యలు చేపట్టాలని, బాలల దోపిడీకి పాల్పడే వ్యక్తులను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. బాల కార్మికులుగా చిన్నారులను పనిలో పెట్టుకునే యజమానులను గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, రక్షించిన చిన్నారులకు అవసరమైన సంరక్షణ, విద్య, వైద్య సహాయం, దీర్ఘకాలిక పునరావాసం కల్పించడంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. ప్రత్యేక బాల న్యాయ పోలీసు విభాగాలు, మానవ అక్రమ రవాణా నిరోధక బృందాలు, బాలల సంరక్షణ అధికారులు, విద్యా శాఖ, వైద్య ఆరోగ్య శాఖ, బాలల సంక్షేమ కమిటీలు, బాలల సంరక్షణ సంస్థలు పరస్పర సహకారంతో పని చేస్తేనే కార్యక్రమం పూర్తి ఫలితాలు ఇస్తుందని పోలీసు అధికారులు తెలిపారు. ప్రతి చిన్నారి సురక్షితంగా ఉండేలా చర్యలు తీసుకోవడం సమాజం మొత్తం బాధ్యత అని, ఈ కార్యక్రమంలో అన్ని శాఖలు మరింత చురుకుగా పనిచేయాలని పోలీసు ఉప కమిషనర్లు స్పష్టం చేశారు. ఈ సమావేశంలో పోలీసు శాఖ, శిశు సంక్షేమ శాఖ, జాతీయ బాల కార్మిక నిర్మూలన ప్రాజెక్టు ప్రతినిధులు మరియు ఇతర ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## నిర్మల్‌లో ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్‌ను ఆకస్మిక తనిఖీ చేసిన కలెక్టర్ భవేశ్ మిశ్రా

**నిర్మల్, జూలై 01, ప్రభాతవార్త:**



జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా బుధవారం కలెక్టరేట్ ప్రాంగణంలోని ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. మధ్యాహ్నం క్యాంటీన్‌లో సిబ్బందితో కలిసి ఆయన భోజనం చేసి, ఆహార నాణ్యత మరియు పరిశుభ్రతను స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. క్యాంటీన్‌లో అందిస్తున్న ఆహారం రుచికరంగా, నాణ్యతా ప్రమాణాలతో ఉండటం పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రజలు, అధికారులు, ఉద్యోగులకు ప్రతిరోజూ పరిశుభ్రమైన వాతావరణంలో పోషక విలువలతో కూడిన ఆహారాన్ని అందించాలని నిర్వాహకులకు సూచించారు. పరిశుభ్రత ప్రమాణాలను నిరంతరం పాటిస్తూ సేవల నాణ్యతను మరింత మెరుగుపరచాలని ఆదేశించారు. అనంతరం కలెక్టర్ తన భోజనానికి సంబంధించిన బిల్లును యూపీఐ ద్వారా స్వయంగా చెల్లించారు. క్యాంటీన్ సిబ్బందిని, నిర్వాహకులను ఈ సందర్భంగా ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు బి. వెంకటేశ్వర్లు, కిషోర్ కుమార్, డీఆర్‌డీఓ విజయలక్ష్మి మరియు పలువురు జిల్లా అధికారులు పాల్గొని క్యాంటీన్‌లో భోజనం చేశారు.

## కుంటాల బీసీ బాలుర హాస్టల్‌లో
### అదనపు సీట్లు పెంచాలి: విద్యార్థి సంఘాల డిమాండ్

**భైంసా, జులై 01, ప్రభాతవార్త:**

కుంటాల మండల కేంద్రంలోని బీసీ బాలుర వసతి గృహంలో సీట్ల కొరత కారణంగా పేద విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వెంటనే అదనపు సీట్లను మంజూరు చేయాలని విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం నిర్మల్ జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి సత్యనారాయణ రెడ్డికి సీవైఎస్ఎస్, యూఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘాల తరఫున వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీవైఎస్ఎస్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ శీతల్కర్ అరవింద్, యూఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నామాత్కార్ నవీన్ మాట్లాడుతూ ప్రస్తుతం హాస్టల్‌లో ఉన్న సీట్లు పూర్తిగా నిండిపోవడంతో ప్రభుత్వ మోడల్ స్కూల్‌తో పాటు ఇతర విద్యాసంస్థల్లో చదువుతున్న అనేక మంది బీసీ విద్యార్థులు వసతి పొందలేక నిరాశకు గురవుతున్నారన్నారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని హాస్టల్‌లో అదనపు సీట్లను తక్షణమే మంజూరు చేసి, అర్హులైన ప్రతి ఒక్కరికీ వసతి కల్పించాలని కోరారు.

## ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశం చేయించిన శ్రీహరిరావు

**సారంగాపూర్, జూలై 01, ప్రభాతవార్త:**

మండల కేంద్రంలో బుధవారం నూతనంగా నిర్మాణం పూర్తయిన ఇందిరమ్మ ఇంట్లో లబ్దిదారుడితో జిల్లా కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ శ్రీహరిరావు గృహప్రవేశం చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం పేదల ప్రభుత్వమని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇళ్లను నిర్మించి ఇవ్వడమే తమ పార్టీ లక్ష్యమని చెప్పారు.రాష్ట్రంలో విడతల వారీగా ఇందిరమ్మ ఇళ్లను ప్రభుత్వం అందిస్తుందని వివరించారు. ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసి, ఇల్లు నిర్మించుకునేలా సహకరించినందుకు కాంగ్రెస్ ప్రభుత్వానికి, ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు అట్ల పోతారెడ్డి, సర్పంచ్ కోనేరు భూమన్న, మార్కెట్ చైర్మన్ అబ్దుల్ ఆది, మాజీ మార్కెట్ చైర్మన్ రాజేశ్వర్, మాజీ ఆడెల్లి టెంపుల్ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ వీరయ్య, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బొల్లోజి నర్సయ్య, నాయకులు రాజ్ మహ్మద్, విలాస్ రావు, నారాయణరెడ్డి, సాయన్న, పంచాయతీ కార్యదర్శి చైతన్య సిబ్బంది పాల్గొన్నారు.